నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

# యాదాద్రి భువనగిరి

బుధవారం 3 జనవరి 2024
WEDNESDAY, JANUARY 3, 2024

YADADRI BHUVANAGIRI

పేజీలు PAGES : 8

# ఆగిన దళిత బంధు

పట్టించుకోని కొత్త ప్రభుత్వం.. ముందుకు కదలని పథకం



భువనగిరిలో గతంలో కేసీఆర్ సర్కార్ అందించిన దళితబంధు నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు (ఫైల్)

మధ్య పేజీల్లో..

- కేసీఆర్ సర్కారులో ఎస్సీలకు రూ.10లక్షల ఆర్థిక సాయం
- గతేడాది రెండో విడుత ప్రక్రియ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి కేటాయింపు
- 240 మందికి యూనిట్లు సైతం మంజూరు
- ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- తొలి విడుతలో యాదాద్రి జిల్లాలో 413 మందికి దళిత బంధు
- వాసాలమర్రిలో మారిన దళితుల జీవితాలు
- నెలకు రూ. 30వేల నుంచి రూ. 50వేల దాకా ఆర్జన

సామాజికంగా, ఆర్థికంగా వెనుబడిన దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన దళిత బంధు పథకం ప్రస్తుతం ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం యథావిధిగా అమలు చేయకుండా పక్కన బెట్టింది. గతేడాది జూలైలో బీఆర్ఎస్ సర్కారు రెండో విడుత దళితబంధు ప్రక్రియ ప్రారంభించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 13,200 మందికి ఇవ్వాలని నిర్ణయించింది. దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ కూడా జరిగింది. 240మంది లబ్ధిదారులకు యూనిట్లు సైతం మంజూరయ్యాయి. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కొనసాగించకుండా కాలయాపన చేస్తున్నది. దరఖాస్తుదారులు మాత్రం దళిత బంధు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే తొలి విడుతలో జిల్లాలో 413మంది దళిత బంధుతో దర్జాగా వ్యాపారాలు చేసుకుంటూ మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. కూలీలు, చిరుద్యోగులుగా అరకొర జీతాలకు పని చేసిన దళితులు ప్రభుత్వం అందించిన రూ.10 లక్షలతో వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఓనర్లయ్యారు.

*– యాదాద్రి భువనగిరి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)*

# ధరణి నిలిపివేత?

- రెండు రోజులుగా తెరుచుకోని సిటిజన్ లాగిన్
- బుక్ కాని స్లాట్లు.. అయోమయంలో రైతులు
- మాడ్యూల్స్ చెకింగ్‌తో తాత్కాలికంగా ఆగిందంటున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 2 : ధరణి నిలిపివేత దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇప్పటికే ధరణికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చే భూమాత పేరు మార్పిడితో పాటు ధరణిలో మాడ్యూ ల్స్ మార్పిడిపై సాంకేతిక బృందం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్ప మిగతా పనులు అధికారులు పూర్తిగా నిలిపివేయగా తాజాగా రెండు రోజుల నుంచి సిటిజన్ లాగిన్ ఓపెన్ కావడం లేదు. సిటిజన్ లాగిన్ అయ్యే క్రమంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీని పూర్తిగా నిలిపివేశారు. దీంతో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేదు. కానీ తాసీల్దార్ లాగిన్‌లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇప్పటికే ధరణిలో పేమెంట్ కట్ చేసి స్లాట్ బుక్ చేయకుండా ఉండడంతో కొందరు ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు ప్రకటన లేకుండా సిటిజన్ లాగిన్ నిలిపివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్న ధరణి మార్పిడితో నూతనంగా వచ్చే పోర్టల్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ధరణిలో మాడ్యుల్స్ చెకింగ్ కారణంగా సర్వర్ సమస్యతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## 7నుంచి డిగ్రీ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

రామగిరి, జనవరి 2 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీలకు ఈ నెల 7నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా అమలు చేయాలని సూచించారు. యూనివర్సిటీ పరిపాలనా విభాగం మాత్రం యాథావిధిగా పని చేస్తున్నదని తెలిపారు.

# సృజనకు పదును.. ప్రతిభకు గుర్తింపు

- పాఠ్యాంశాల బోధనలో సైన్స్ టీచర్ పవిత్ర ప్రత్యేకత
- విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యం
- రైతు, వాతావరణ సమస్యల పరిష్కారానికి కృషి
- ఆమె సేవలకు రాష్ట్రస్థాయి అవార్డులు
- తాజాగా 17నుంచి 20 వరకు జరిగే ఎన్ఎస్‌టీడబ్ల్యూకు ఆహ్వానం

మధ్య పేజీల్లో..



విద్యార్థులతో ప్రయోగం చేయిస్తున్న ఉపాధ్యాయిని పవిత్ర

# పెట్రోల్ కోసం క్యూ

ట్యాంకర్ యజమానుల సమ్మె ఎఫెక్ట్

8లో..



యాదగిరిగుట్టలో పెట్రోల్ బంక్‌లో రద్దీ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మోటరు చట్ట సవరణను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ యజమానులు ఆందోళన చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ మంగళవారం నిరసనలు జరిగాయి. దాంతో పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బంకుల వద్ద బారులుదీరారు. ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోల్‌ను నింపుకొన్నారు. నిల్వలు అయిపోవడంతో భువనగిరి పట్టణంతోపాటు పలు మండలాల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో పలుచోట్ల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.

*– యాదాద్రి భువనగిరి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)*



క్యాన్‌లో పెట్రోల్ నింపుకొని వెళ్తున్న యువకుడు